జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 27-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 145 పేజీలు: 8 వెల: రూ.7


## ఒడిశా టు కేరళ వయా కర్ణాటక

* 10 కిలోల గంజాయితో పట్టుబడ్డ వెస్ట్ బెంగాల్ యువకుడు



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 26 (వార్త):** ఒడిశాలో గంజాయి తీసుకుని ఆంధ్రాలో ట్రైన్ ఎక్కి కర్ణాటక వరకు వెళ్లి అక్కడ నుంచి కేరళకు తరలించి విక్రయిస్తున్న వెస్ట్ బెంగాల్ కి చెందిన ఓ యువకుడిని ఇచ్ఛాపురం పోలీసులు శనివారం పట్టుకుని అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ మీసాల చిన్నంనాయుడు మీడియాతో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ మూషిదాబాద్ జిల్లాకి చెందిన రహీన్ అలీ అనే వ్యక్తి కేరళలో సెంట్రింగ్ పనులు చేసుకుంటున్నాడు. అక్కడ జిలీల్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుని ఒడిశా సరగడ లోరాహుల్ అనే వ్యక్తి వద్ద 10.150 కిలోల గంజాయిని రూ.4వేలుకు కొని రూ.10వేలకు కేరళకి తరలించి విక్రయిస్తున్నాడన్నారు. బెర్హంపూర్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఇచ్ఛాపురం చేరుకుని రైల్వే స్టేషన్లో ట్రైన్ ఎక్కి బెంగుళూరుకు వెళ్లి అక్కడ నుండి కేరళ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా టౌన్ ఎస్ఐ చిన్నం నాయుడుకి వచ్చిన సమాచారం మేరకు అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## మహిల మెడలో.. పుస్తెల తాడు చోరీ

**పోలాకి, అక్టోబర్26 (వార్త):** బెలమర గ్రామానికి చెందిన పొట్నూరు రత్నం మెడలో ఉన్న తులంన్నర బంగారం నల్ల పుస్తెల తాడును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై శనివారం వచ్చి లాక్కెళ్లిపోయారు. ఆమె కేకలు వేయగా, చోరీచేసిన వ్యక్తులు వాహనంపై పిన్నింటిపేట మీదుగా వనవిష్ణుపురం దాటి వేగంగా వెళ్లిపోయారు. స్థానికులు వెంబడించినా ఫలితం లేకపోయింది. ప్రతిరోజూ పొట్నూరు రత్నం తోటి మహిళలతో కలిసి బెలమర రోడ్డులో వాకింగ్ చేస్తుంటారు. బాధితురాలు పోలాకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# సైబర్ మోసానికి గురైతే.. 1930కి ఫిర్యాదు చేయండి



* అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ
* బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి
* ఇప్పటి వరకూ 618 ఫోన్లు రికవరీ
* బాధితులకు 154 మొబైల్ ఫోన్లు అందజేత
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, అక్టోబర్26 (వార్త):** ఎవరైనా సైబర్ నేరగాళ్లు చేతుల్లో మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించి ఫిర్యాదు నమోదు చేసుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలు కొంతమేరకు నియంత్రించవచ్చునన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ఓటిపి, లింకు క్లిక్, మాల్వేర్, ఏపీకే ఫైల్ తరహా నేరాలతో పాటు ఈ మధ్యకాలంలో డిజిటల్ అరెస్టు తరహా నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, గుర్తింపు కార్డు వివరాలు అనధికారి వ్యక్తులకు, సంస్థలకు గాని తెలపకూడదని సూచించారు. కొంతమంది సైబర్ నేరగాళ్లు పోలీసులు మంటూ నమ్మిస్తూ, పోలీసు యూనిఫాంతో మారువేషాలో బెదిరింపు ఫోన్ కాల్స్ చేసి డిజిటల్ అరెస్టుకు ప్రయత్నిస్తున్నారన్నారు. జిల్లా పోలీసు అధికారులు సిబ్బందితో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయాలు, నిల్వకు అనుమతులు తీసుకోవాలన్నారు. బాణసంచా నిల్వలు, విక్రయాలు అనుమతులు ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలన్నారు. బాణాసంచా విక్రయాలు దుకాణాలు ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని, దుకాణానికి మధ్య 5 నుంచి 10 అడుగల మధ్య దూరం వ్యవధి ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు, నిల్వలు, తయారీ చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పరిమితికి మించి మందుగుండు సామగ్రి నిల్వ లేకుండా చూడాలన్నారు. గత రెండు నెలల వ్యవధిలో జిల్లాల్లో పోగొట్టుకున్న 154 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. ఫోన్లను పోగొట్టుకున్న వారు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా సీఈఐఆర్.జీఓబి.ఇన్ అనే పబ్లిక్ వెబ్ సైట్ లో ఫోన్‌ను తిరిగి పొందుటకు గాను బ్లాకింగ్ రిక్వెస్ట్‌ను రిజిస్టర్ చేసుకోవాన్నారు. ఇలా వచ్చిన ఫిర్యాదులు మేరకు గత రెండు నెలల వ్యవధిలో 154 ఫోన్లు రికవరీ చేశామన్నారు. వాటి విలువ సుమారు 24 లక్షలు రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు జిల్లాలో మొత్తంగా 618 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇవ్వడం జరిగిందన్నారు. మొబైల్స్ వాడే వారు తప్పనిసరిగా ఫోన్లుకు సెక్యూరిటీ లాక్ ఉపయోగించాలని, వ్యక్తిగత, విలువైన సమాచారాన్ని మొబైల్స్ లో ఉంచకుండా జాగ్రత్త వహించాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ ఇమ్మానియల్ రాజు, సైబర్ సెల్ సీఐ టి.శ్రీను, సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అయ్యప్ప మాలధారులకు.. శుభవార్త



* ఇకపై ఇరుముడితో విమాన ప్రయాణం
* నిబంధనలు సడలించిన విమానయాన సంస్థ
* జనవరి 20 వరకూ అవకాశం
* ప్రకటించిన కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
* హర్షం వ్యక్తం చేసి అయ్యప్ప మాలధారులు

**శ్రీకాకుళం, అక్టోబర్ 26(వార్త):** ఏటా ఎన్నో కఠిన నియమ, నిష్టల మధ్య అయ్యప్ప దీక్షలు చేపట్టే లక్షలాది మంది భక్తులకు కేంద్ర పౌర విమానయాన శాఖ శుభవార్త తెలిపింది. ఎంతో పవిత్రంగా భావించే పవిత్ర ఇరుముడితో నేరుగా విమాన క్యాబిన్‌లోనే ప్రయాణం చేయవచ్చని వెల్లడించింది. భక్తుల వినతులను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు సడలించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ప్రకటించారు. దీనికి అనుగుణంగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ డీజీ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. భద్రతా కారణాల రీత్యా విమానాల్లోకి కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని ఇన్నాళ్లూ అనుమతించడం లేదన్నారు. దీంతో అంతా రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. మకర జ్యోతి దర్శనం ముగిసి, జనవరి 20 వరకు భక్తులకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందన్నారు.

### డచ్‌భవనం చుట్టూ ఉద్యానవనం

మూడు వందల ఏళ్ల నాటి డచ్ భవనం చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, తదితర అధికారులతో కలసి శనివారం ఆయన డచ్ బంగ్లాను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఢిల్లీ గేట్ తరహాలో డచ్ భవన్ చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని గ్రీనరీని ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకాకుళం నగర ప్రజానీకం సేద తీరేందుకు ఒక ఐకానిక్‌గా డచ్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలన్నారు. రూ.100 కోట్లతో ప్రపంచ ప్రసిద్ధ దేవాలయం అరసవెల్లి సర్క్యూట్‌ను, శ్రీకూర్మం సర్క్యూట్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రఖ్యాత సంస్థలకు ఈ డిజైన్లను రూపొందించే పని అప్పగించాలని కేంద్రమంత్రి చెప్పారు. త్వరలోనే శ్రీకాకుళం జిల్లాలో సిక్కోలు సంబరాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్ కూడా ఏర్పాటు చేద్దామన్నారు. ముందుగా రెండు లేదా మూడు రోజుల పాటు ఏర్పాటు చేద్దామని, ప్రజల స్పందన చూసి ఫెస్టివల్ పొడిగింపు ఉంటుందన్నారు. జిల్లాలో గల టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని, పెద్దపాడు చెరువును అభివృద్ధి చేసేందుకు కూడా ప్రణాళిక రూపొందించామన్నారు. రహదారులు, భవనాల గ్రౌండ్‌లో దీపావళి సంబరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ కేంద్రమంత్రికి వివరించారు. ఆర్డీఓ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, పర్యాటక శాఖ అధికారి ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, పర్యాటకశాఖ అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం


## జనసేన ఇన్‌చార్జ్ దృష్టికి సమస్యలు

**జలుమూరు, అక్టోబర్ 26(వార్త):** జలుమూరు గ్రామంలో గల వివిధ సమస్యలను గ్రామ జనసైనికులు నరసన్నపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జి బలగ ప్రవిణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఇన్‌చార్జ్‌ని కలిసిన జన సైనికులు వసంత్, అప్పారావు, చంటి, రమేష్, కుమార్‌తో పాటు టీడీపీ నాయకులు యజ్జల జగన్, కొర్నానా తారకేశ్వరరావు, ఆనంద్, గంగారపు ఆసిరినాయుడు ఉన్నారు.



# పార్టీ సభ్యత్వం.. ఆత్మగౌరవానికి ప్రతీక

* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* అరసవల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు




**శ్రీకాకుళం టౌన్, అక్టోబర్26 (వార్త):** టీడీపీ సభ్యత్వం ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అరసవల్లిలో 25 26 డివిజన్ల పరిధిలో నియోజకవర్గంలో మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ శనివారం ప్రారంభించారు. ముందుగా అరసవల్లి రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్న ఎన్టీఆర్ ఆనాడే బీజం వేశారని తెలిపారు. అదే స్ఫూర్తితో, అన్న ఆశయ సాధన కోసం అభివృద్ధి ప్రధాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుకు వెళ్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ప్రతి రెండేళ్లకు ఒకసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటోందని వివరించారు. గతంలో రూ. రెండు లక్షలు ఉన్న బీమా ప్రస్తుతం 5 లక్షలకు పెంచారని వివరించారు. పార్టీ సభ్యత్వం ద్వారా ఆర్థిక భరోసాకు, భవిష్యత్ భరోసా నారా లోకేష్ బాబు కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా ఎన్నో ఆర్థిక, విద్యా, ఆరోగ్య భరోసా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని చెప్పారు. పార్టీ సభ్యత్వం కార్యక్రమంలో అన్ని వర్గాల వారు సభ్యత్వం తీసుకొని టీడీపీ మరింత బలోపేతం చేయడానికి, పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ముందు తీసుకెళ్లడానికి, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చెందే విధంగా సహకరించాలని కోరారు. అరసవల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. రథసప్తమిని కూడా రాష్ట్ర పండుగ గుర్తించాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరడం జరిగిందన్నారు. ఆయన వెంటనే పరిశీలించి రాష్ట్ర పండుగగా రథసప్తమిని గుర్తించేందుకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చం నాయుడు సహకారంతో ఉత్తర్వులు వెలువడనున్నాయని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు చిట్టి నాగభూషణం, ఉంగటి రమణ, మైలపల్లి అర్జున్, తెలుగు నాగరత్నం, గొలివి దాము, కొయ్యన రామ్మోహన్, తెలుగు జగదీష్, గొలివి రమణ, జ్యోతి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీటెక్ చదువుతున్న నిరుపేద విద్యార్థి దండేపల్లి ఉదయ భాస్కర్‌కు రూ.35,000 విలువ చేసే ల్యాప్ టాప్ ను అందజేశారు.



## పోలీసుల విధులపై అవగాహన అవసరం

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26(వార్త):** పోలీసులు విధి నిర్వ హణలో భాగంగా నిత్యం ఉపయోగించి పోలీసు ఆయుధాలు, పరికరాలు, విధి విధానాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లాలో జరుగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకాకుళం పట్టణంలో రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీసు ఆయుధాలు, పరికరాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, పోలీసు జాగిలాలు పనితీరు, పోలీసులు విధి విధానాలపై అవగాహన కల్పించారు. శ్రీకాకుళం జిల్లాలో అక్టోబర్ 21 తేదీ నుంచి జిల్లాలో జరుగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా శనివారం శ్రీకాకుళం పట్టణంలో రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయుధాలు ప్రదర్శన నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, మోసాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,చర్యలు గురించి తెలియజేస్తూ వారి నుంచి సైబర్ నేరాలపై ఏవిధంగా అప్రమత్తం చేస్తున్నా మన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరాలు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం సబ్ డివిజన్ డీఎస్పీ సిహెచ్ వివేకానంద, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, సీఐలు ఉమామహేశ్వరరావు, ఇమ్మానియేల్ రాజు, సూర్యారావు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామక పత్రాలు అందజేత




**శ్రీకాకుళం టౌన్, అక్టోబర్26(వార్త):** ఆర్టీసీలో కండక్టర్లుగా బాగా పని చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ. విజయ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో నలుగురికి కారుణ్య నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఇందులో ఎం. సుగుణమణి (భర్త కె. కాంతారావు (డ్రైవర్) ఎం.ఎల్. నారాయణ (తండ్రి ఎం.ఎం. రావు, డ్రైవర్), ఎస్. సంజయ్ (తండ్రి ఎస్.జి. మూర్తి, డ్రైవర్), డి. వినయ్ కుమార్ (తండ్రి బి.పి. రావు డ్రైవర్)లకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ ఉద్యోగానికి నియామకం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పర్సనల్ అధికారి ఎస్పి కృష్ణవేణి, సీనియర్ అసిస్టెంట్ ఎంకె నాయుడు పాల్గొన్నారు.

## కిష్టప్పపేట రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**శ్రీకాకుళం రూరల్, అక్టోబర్26 (వార్త):** రూరల్ మండలం కిష్టప్ప పేట గ్రామంలో 50 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లోని రోడ్లు పూర్తిగా గుంతల మయంగా మారిందన్నారు. ఇటీవల నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో శంకుస్థాపన చేసిన పనులను ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. అందులో భాగంగానే కిష్టప్పపేట రోడ్డుకు 50 లక్షల రూపాయలు మిగిలినట్టు వివరించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కూటమి ప్రభుత్వ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆదిత్యుని సన్నిధిలో దేవానందగిరి స్వామీజీ

**అరసవల్లి, అక్టోబరు 26(వార్త):**ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామిని విజయ వాడ, పెద్దపులి పాక నుండి వాసు దేవానందగిరి స్వామీజీ శనివారం దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలను, జ్ఞాపికను ఆలయ ఈవో యర్రం శెట్టి భద్రాజీ అందజేశారు.

## 29న మెగా ఉచిత వైద్య శిబిరం

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26(వార్త):** జిల్లాలో జరుగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా ఈనెల 28న జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. అదేరోజు రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు ఎవరైనా రక్తదానం స్వచ్ఛందంగా చేసేందుకు ముందుకు రావాలని కోరారు. శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, బ్లడ్ డొనేషన్ క్యాంప్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు ఉంటుందని చెప్పారు. ఈ మెగా వైద్య శిబిరంలో పోలీస్ సిబ్బందికి సాధారణ వైద్య పరీక్షలతోపాటు కార్డియాలజీ, ఇతర ముఖ్యమైన పరీక్షలు చేయిస్తారని తెలిపారు. బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని అదే విధంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసే ప్రజలకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరం, బ్లడ్ డొనేషన్ క్యాంపులు టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 29న, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో 30న నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

## సాయిబాబా సంస్మరణ సభ విజయవంతం చేయండి

**పలాస, అక్టోబరు 26 (వార్త):** విజయవాడలో ఈనెల 31న నిర్వహించనున్న జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను విజయవంతం చేయాలని వక్తలు కోరారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక హాల్లో ఏర్పాటు చేసిన సదస్సులో జిల్లా అధ్యక్షులు జామన వెంకటరావుతో పాటు రాష్ట్ర నాయకులు వీరస్వామి, పౌర హక్కుల సంఘం నుంచి కార్యదర్శి పిండి వెంకట్రావు, అధ్యక్షులు పత్రి ధానేష్ ఢిల్లీ రావు, వైకుంఠ రావు, లక్ష్మణ్, నాగమణి, గంగయ్య, సూరి మాట్లాడుతూ ఈ సంస్మరణ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొంటున్నారన్నారు.

## 5న పీడీఎస్‌యూ అర్థ శతాబ్ది ఉత్సవాలు

**పలాస, అక్టోబరు 26 (వార్త):** విజయవాడలో నవంబర్ 5న నిర్వహించే పీడీఎస్‌యూ అర్థ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర నాయకుడు ఎం. వినోద్ కోరారు. దేశంలో ఎటువంటి సమస్యలైనా పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. సంఘాలన్నీ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## తల్లీ కూతురుపై దాడి



**పలాస, అక్టోబర్ 26(వార్త):** పలాస సమీపంలోని తాళభద్ర దగ్గర తల్లీ ఎం. సూదిష్టతో పాటు కుమార్తెపై శుక్రవారం రాత్రి నలుగురు యువకులు దాడి చేశారు. వజ్రపు కొత్తూరు మండలం రాజాంలో నందన్న సంబరాలు సందర్భంగా ఈవెంట్స్‌లో పాల్గొని తిరుగు పయనమైన తల్లీ కూతుళ్లతో పాటు వారి బంధువుపై పలాస మండలం బొడ్డపాడుకు చెందిన జెస్సీ ఈవెంట్ ఆర్గనైజర్, పలాస మండల తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీ రావులతో పాటు మరో ముగ్గురు యువకులు తాళబద్ర ఎల్‌సి గేటు దగ్గర దారి కాచి చితక్కొట్టారు. బాధితులు 100కు డయల్ చేసి తమ గోడును వినిపించారు. పోలీసులు రాకతో నలుగురు పోకిరీలు పరారయ్యారు. గతంలో జెస్సి ఈవెంట్ ఆర్గనైజేషన్‌లో క్లాసికల్ డాన్సర్‌గా చేరిన సోంపేట మండలం కొర్లాంకు చెందిన మైనర్ బాలిక చేసేది. ఆర్గనైజర్ వ్యవహార శైలి నచ్చక జెస్సీ ఈవెంట్స్‌కు గుడ్ బై చెప్పేసింది. ఈ నేపథ్యంలో రాజాంలో జరిగిన ఈవెంట్‌లో పాల్గొని తిరిగి వస్తుండగా తాళ భద్ర దగ్గర మాటు వేసి కాపు కాసిన జెస్సీఈవెంట్ ఆర్గనైజర్ ఢిల్లీరావు తన అనుచరులైన బైనపల్లి ప్రణయ్, బైనపల్లి వినయ్, చరణ్ లతో తల్లీకూతుళ్లపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం




**జలుమూరు, అక్టోబర్ 26(వార్త):** పోలీస్ చట్టాలపై యువతకు అవగాహన అవసరమని ఎస్ఐ దుర్గ ప్రసాద్ తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉన్న నేడు నేరాలు జరగవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అసిరి నాయుడు, రైటర్ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అపార్ నమోదు తప్పనిసరి

**జలుమూరు, అక్టోబర్ 26(వార్త):** కరవంజ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అపార్ డిక్లరేషన్ ఫారమ్స్ ఇవ్వడం జరిగిందని ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి ఈ అపార్ నమోదు తప్పనిసరి అన్నారు. ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు ఎంత అవసరమో ఇకనుంచి విద్యార్థులకు అపార్ కూడా అంతే అవసరమని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

**జలుమూరు, అక్టోబర్ 26(వార్త):** పెద్దనామానపేట, సిహెచ్ నామానపేట గ్రామాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు హెల్త్ సూపర్వైజర్ చిన్న రాజులు తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరానికి విచ్చేసిన స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.





## మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

### గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్

**మందస, అక్టోబరు 26(వార్త):** ప్రకృతి పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ పిలుపునిచ్చారు. మందస మండలంలోని బహాడపల్లి ఉన్నత పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో కదంబ, బాదం, చెర్రీ, ఉసిరిక, కాము, తురాయి వివిధ రకాల నీడనిచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతువుల క్రమం తప్పి తుఫానులు, ప్రకృతి విలయాలు దారి తీయడానికి పర్యావరణ సమ తుల్యత లోపించడమే కారణమన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పట్ల విద్యార్థులకు ఇప్పటినుండే అవగాహన కల్పిస్తే రాబోయే తరాలకు మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి జన్మదిన సందర్భంగా స్కూలుకి కొన్ని మొక్కలు ఇచ్చి, వాటిని నాటి పర్యావరణ కాపాడా లన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దీనబంధు, వసంత రావు, ప్రకాష్‌రావు, శంకర్రావు, విజయలక్ష్మి, రెహనా, దీప్తి, సాంబమూర్తి, కృష్ణారావు, వెంకటరమణ, ఢిల్లీ రావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు ఉచిత మందులు



**మందస, అక్టోబరు 26(వార్త):**గొర్రెల్లో, మేకల్లో నట్టల నివారణకు ఉచిత మందులు అందిస్తున్నట్టు మందస, హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమభారతి చెప్పారు. మందస మండలంలోని బాలిగాంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31వరకు గొర్రెలలో, మేకలలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాధారణంగా జీవాలలో అంతర పరాన్న జీవులు సమస్య ఎక్కువగా ఉండటం వలన సరైన బరువు పెరగకపోవడం, రక్తహీనత, రోగ నిరోధకశక్తి తగ్గడం వలన రకరకాల వ్యాధుల బారిన పడి చనిపోవడంతో జీవాల పెంపకదారులు ఆర్థికంగా చాలా నష్టపోతూ ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నటువంటి ఈ నట్టల నివారణ మందులను జీవాల పెంపకదారులు వినియోగించుకోవాలని పశువైద్యాధికారులు శ్రీకాంత్, ఉమాభారతి సూచించారు. దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రం ద్వారా ఈ నటల నివారణ మందులు ఉచితంగా పొందవచ్చని తెలిపారు.

## సుడి దోమ నివారణ చర్యలు చేపట్టండి

**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26(వార్త):** ఖరీఫ్‌లో వరి పంటలో ఇటీవల సుడి దోమ ఎక్కువగా కనిపిస్తుందని, దానిని నివారించే మార్గాలను రైతులు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడి కోరాడ త్రినాథ స్వామి తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం సత్యవరం గ్రామంలో పంట పొలాలను పరిశీలించిన అనంతరం రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి దశలోనే సుడిదోమ నివారించగలిగితే ఆశించిన ఫలితాలను పొందవచ్చునన్నారు.

## విద్యార్థులకు యూనిఫారం పంపిణీ

**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26(వార్త):** నరసన్నపేట మండ లం గోపాలపెంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం గ్రామంలో ఉండే యువకులు ద్వారా రాజు టెక్స్ టైల్స్ రమేశ్ వైట్ యూని ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ దుస్తులు సరఫరా చేయడం ద్వారా ప్రతిరోజు ఉత్సాహంగా స్కూలుకు వచ్చి పాఠాలు నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోండి

### * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
### * ఏడు బస్సు సర్వీసుల ప్రారంభం



**టెక్కలి, అక్టోబరు 26 (వార్త):** ఆయా ప్రాంత ప్రజలు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి మత్స్యశాఖా మాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం టెక్కలిలో పోలీస్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను పూజలు నిర్వహించి అనంతరం జెండా ఊపి ఏడు బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ బస్సులు శ్రీకాకుళం-1, 2, టెక్కలి డిపోలకు చెందిన వివిధ రూట్లకు సర్వీసు అందిస్తాయన్నారు. టెక్కలి - శ్రీకాకుళం - అమలాపురం మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, టెక్కలి - విశాఖపట్నం - ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త ఎక్స్ ప్రెస్, టెక్కలి - విశాఖపట్నం - ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త (అద్దె ఎక్స్ ప్రెస్), శ్రీకాకుళం- విజయవాడ మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, శ్రీకాకుళం- విజయనగరం మార్గంలో ఒక ఎక్స్ ప్రెస్, శ్రీకాకుళం - బత్తిలి మార్గంలో ఒక అద్దె పల్లె వెలుగు, శ్రీకాకుళం - విశాఖపట్టణం మార్గంలో ఒక అద్దె అల్ట్రా డీలక్స్ బస్సులు ఆయా రూట్లలో ప్రజలకు సర్వీసులు అందిస్తాయన్నారు. ఇందులో మూడు బస్సులు అద్దెవని, నాలుగు బస్సులు ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు బస్సుల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని సర్వీసులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం మాజీ శాసన సభ్యులు కలమట వెంకటరమణ, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, ఆర్ఎం, శ్రీకాకుళం 1,2, టెక్కలి డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

# జూన్ 2025 నాటికి నదుల అనుసంధానం

### * సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, అక్టోబర్ 26 (వార్త):**జిల్లా వెంబడి ప్రవహిస్తున్న ప్రధాన నదులైన నాగావళి, వంశధార నదుల అనుసంధానం జూన్ 2025 నాటికి పూర్తిచేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పలు ప్రాజెక్టుల ముఖ్య అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శనివారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. నదుల అనుసంధానానికి సంబంధించి ఇప్పటికే 106 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 75 శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కొద్దిపాటి భూసేకరణ సమస్యలు పూర్తిగా పరిష్కరించి గడువులోగా ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామని అన్నారు. జిల్లాకు జీవనాడి, వ్యవసాయ రంగానికి ప్రధాన ఆయువు పట్టు అయిన బి.ఆర్.ఆర్.వంశధార ప్రాజెక్టు స్థితిగతులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఒడిశాతో నేరడి వివాదాన్ని, సైడ్ వియ్యర్ పనితీరు, సింగిడి, పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ల గురించి అడిగి తెలుసుకున్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు గేట్లు అమర్చే పక్రియ ఇంకా మిగిలి ఉందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. హిరమండలం ప్రధాన రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్‌పై పలు ప్రశ్నలు అడిగారు. రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తి అయినట్లు, ప్యాకేజీ 87, 88 పనులను, కాలువల పరిస్థితిని ప్రాజెక్ట్ ఎస్ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టేజ్ 2 ఆఫ్ ఫేస్ 2 పనులు, ఫ్లడ్ ఫ్లో కెనాల్ తదితర అంశాలపై చర్చ సాగింది. కోర్టు కేసులు, భూసేకరణ వివాదాలు, పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని సూచించారు. అలాగే హిరమండలం ప్రధాన రిజర్వాయర్ కోసం గొట్టా బ్యారేజ్ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఏడాది నీటిని పంపుల ద్వారా రిజర్వాయర్‌కి తరలించి 19 టిఎంసిల నీటిని నిల్వ ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇదే ప్రోజెక్టు ఆధారంగా ఉద్దానంలో 700 గ్రామాలకు మంచి నీటి పథకం పనిచేస్తున్న వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్ట్‌నకు సంబంధించిన తాజా పనులు, నేరడి బ్యారేజ్, వంశధార ట్రిబ్యునల్, స్టేజ్-2 ఆఫ్ ఫేస్-2 లను గురించి, రేగులపాడు వద్ద నిర్మాణంలో ఉన్న ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనుల ప్రగతిపై అడిగారు. 24,600 ఆయకట్టుకి సంబంధించిన పనులు 40 శాతం పూర్తి చేసినట్లు, అలాగే పలాస మెలియాపుట్టి రోడ్డు 3.6 కిలోమీటర్ల మేర వేయాల్సిన డైవర్షన్ రోడ్డు అంశంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ స్వర్ణ కుమార్, ఈఈ శేఖర్, హిరమండలం రిజర్వాయర్ డిఈ రమణ తదితర అధికారులు హాజరయ్యారు.

# వేధింపులకు పాల్పడితే సహించం

### మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

**మందస, అక్టోబరు 26(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు వేధిస్తే సహించబోమని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హెచ్చరించారు. మందస మండలంలోని శనివారం పర్యటించారు. దాడికి గురైన కార్యకర్తలను పరామర్శించి, మనోధైర్యం చెప్పారు. హరిపురంలో చికిత్స పొందుతున్న మహిళకు సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందస పోలీసు స్టేషన్ వెళ్లి, సీఐ, ఎస్ఐలతో మాట్లాడారు. చట్ట ప్రకారం పోలీసులు నడచుకోవాలని, ఎవరో, ఏదో చెప్పారని వేధింపులు చేస్తే సహించమన్నారు. తప్పు జరిగితే తప్పక శిక్షించాలని, కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు పిలవడం, వేధింపులు చేస్తే.. ప్రతి చర్య ఉంటుందన్నారు. శాంతియుత నిరసనలు చేపడతామన్నారు. ఆయన వెంట ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, బాలిగాం సర్పంచ్ తలగాన చంద్రశేఖర్, మందస సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, పార్టీ నాయకులు బత్తిని లక్ష్మణ్, బాడ జగన్నాయకులు, యవ్వారి నాగేశ్వరరావు, సురేష్ పాణిగ్రాహి తదితరులు ఉన్నారు.





## టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా అర్చన

**జలుమూరు, అక్టోబర్ 26 (వార్త):** తెలుగుదేశం పార్టీ నరసన్న పేట నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుమార్తె బగ్గు అర్చన నియమితుల య్యారు. ఈ మేరకు పోలాకి మండ లం కత్తిరివానిపేట క్యాంపు కార్యాల యం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కన్వీనర్‌గా నియ మితులైన ఆమె మాట్లాడుతూ బగ్గు రమణమూర్తి ఆశయాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేస్తా మన్నారు. టీడీపీ భావాలను, సమా చారాన్ని మరింత సమర్ధవంతంగా ప్రజలకు చేరవేయడానికి. తాను సోషల్ మీడియా కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నానని అర్చన పేర్కొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎంఆర్‌సికి ఎఫ్‌ఎ2 పరీక్ష పేపర్లు



**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26(వార్త):** నరసన్నపేట మండలం మండల విద్యా వనరుల కేంద్రానికి శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన ఎఫ్ఎ 2 ఎగ్జామ్ పేపర్స్ చేరుకున్నాయి. అయితే నవంబర్ 4వ తేదీ నుంచి ఈ ఎగ్జామ్స్ జరగనున్న నేపథ్యంలో వీటిని ఎంఆర్సీలో భద్రపరిచి ఆ రోజు స్కూల్కు డిస్ట్రిబ్యూషన్ చేస్తారు. మండలానికి సంబంధించిన ఆన్లైన్లో ఉండే విద్యార్థుల సంఖ్య ఆధారంగా పేపర్లను మండలాలకు పంపించడం జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

# ఒక్క సిక్స్ కూడా కొట్టలేకపోయారు

*** డైవర్షన్ పాలిటిక్స్ పైనే దృష్టి * కూటమిపాలనలో అటకెక్కిన సంక్షేమం * రాష్ట్రంలో శాంతి భద్రతలు సరిగా లేవు * వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ నర్తు రామారావు**



**కంచిలి, అక్టోబర్ 26 (వార్త):** రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌ను చంద్రబాబు అండ్ కంపెనీ చేపడుతోందని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అమలు తీరు సక్రమంగా లేదని, రోజుకు ఒక ప్రాంతంలో అఘాయిత్యాలు జరుగుతున్నట్టు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలు వియోగం, వ్యాపారం ఈ ప్రభుత్వంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా చలామణి అవుతోందని ఆయన అన్నారు. డయేరియాతో ఒక విజయనగరంలోనే 13 మంది చనిపోయారని, ప్రజల ప్రాణాల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని రామారావు తెలిపారు. ఎంతో బాధ్యతతో పరిపాలన చేయాల్సిన ముఖ్యమంత్రి రాజకీయ ప్రతీకార చర్యలతో, డైవర్షన్ రాజకీయాలు చేపడుతున్నారని ఎద్దేవ చేశారు. ఒకసారి తిరుపతి లడ్డు అపవిత్రం అయిందని, మరోసారి జగన్ కుటుంబ వ్యవహారాలు, ఇంకోసారి రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి పైన, ఇలా కాలక్షేపం చేస్తూ కూటమి ప్రభుత్వం కాలం వెల్లతీస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ%శీ% ఎంతో సంక్షేమాన్ని అందిస్తే, సూపర్ సిక్స్ అనే మోసపూరిత హామీ ఇచ్చి.. ఇంకా అంతకంటే ఎక్కువ ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి ఆ హామీలను గాలికి వదిలేసారని ఎమ్మెల్సీ విమర్శించారు. ఏడాదికి మూడు వేల కోట్లు భారంతో గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేదానికి ఆరు మాసాల సమయం తీసుకుంటున్నారని అన్నారు. ఈ లెక్కన చూస్తే వాళ్లు ఇచ్చిన సూపర్ సిక్స్ లో ఒక సిక్స్ కూడా కొట్టలేరని, వీటినుంచి ప్రజల దృష్టి మరలించేందుకు రోజుకో అంశాన్ని తెరమీదకు తీసుకువస్తున్నారని ప్రభుత్వం చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు. ఆరు మాసాలుగా సంక్షేమ ఫలాలు అందుకోలేక బీద ప్రజలు అవస్థలు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. జగనన్న అధికారం కోల్పోయాక, తమకు ఇటువంటి పరిస్థితి వచ్చిందని గత పాలనతో పోలిక చేసుకుంటున్నారు. సందర్భం వచ్చేటప్పుడు ఈ వ్యతిరేకతను ప్రజలు చూపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే



**పాతపట్నం, అక్టోబర్ 26(వార్త):** పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.కణితి రాము ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చక్రపతి, అధ్యాపకులు హనుమంత రావు నాయక్, టి.రమేష్, డి.బాబురావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## రికార్డ్ స్థాయిలో ధర పలికిన గజలక్ష్మి అమ్మవారి చీర

ఇచ్ఛాపురం, అక్టోబర్ 26 (వార్త): రత్తకన్న గజ లక్ష్మి అమ్మ వారి చీర వేలం పాట వేశారు. అనిల్ కుమార్ దోలాయి జ్యోతి దంపతుల కుమారుడు అకిరా నందన్ దోలాయి రూ.1,32,002లకు ఈ చీరను వేలం పాటలో గెలుచుకున్నారు. గత వారం రోజులుగా గజలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్లుగా గజలక్ష్మీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



## వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 26 (వార్త):** పట్టణ పరిధి అప్పన్న పేటకు నీలాపు కీర్తి (30) అనే వివాహిత అదృశ్యం అయినట్లు ఆమె భర్త నీలాపు హరి ప్రసాద్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు టౌన్ ఎస్ఐ చిన్నం నాయుడు చెప్పారు. 2007లో ఆమెతో వివాహమైనట్లు వీరికి ఒక పాప, బాబు జన్మించినట్లు చెప్పారు. బతుకుతెరువు నిమిత్తం కలకత్తాలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ తన భార్య పిల్లలను తన అమ్మానాన్నలతో కలిసి అప్పన్న పేటలో ఉంచినట్లు చెప్పారు. ఈనెల 19వ తేదీన తన భార్య స్కూలుకు సుర్ల వెళుతున్నట్లు ఫోన్ చేసి చెప్పినట్లు తదుపరి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడంతో ఫిర్యాదారుడు కలకత్తా నుండి ఇచ్ఛాపురం వచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. ఆమె ఆచూకీ లభించనందున ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## పాఠశాల పనితీరుపై సంతృప్తి

**కంచిలి, అక్టోబర్ 26 (వార్త):** మండలంలోని చోట్రాయిపురం ఎంపీపీ స్కూల్ వార్షిక తనిఖీని చేసిన మండల విద్యా శాఖాధికారులు సప్పటి శివరామ్ ప్రసాద్, కుంబిసి చిట్టిబాబు పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, ప్రతిభా పాఠవాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరు, స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ, విద్యార్థుల వర్క్ బుక్ కరెక్షన్ పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. 2వ తరగతి విద్యార్థిని దుబ్బ తిరుమలకు చతుర్విధ ప్రక్రియలలో 45,76,845 ను 18 చే భాగించే లెక్క ఎంఈఓ ఇవ్వగా, ఆ విద్యార్థిని చేసిన విధానం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరో ఊలాల నందు ప్రదర్శించిన వారగణన, రాష్ట్రాలు వాటి రాజధానులు, దేశాలు వాటి రాజధానులు మొదలగు అంశాలు చూసి అభినందించారు. ఈ సందర్భంగా సప్పటి శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనపథకం అమలు తీరు ఇంకా రుచికరంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మద్దు తిరుపతి రావు, చల్ల లింగమూర్తి, యరాడి దీనబంధు, జగన్నాధరావు, శేఖర్ పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**కంచిలి, అక్టోబరు 26 (వార్త):** పెద్ద శ్రీరాంపురం పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో వి.తిరుమలరావు పరిశీలించారు. తోటలలో జరుగుతున్న సరిహద్దు కందకాలు, పనులను ఏపీవో జి. ధనుంజయతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వేతన కూలీదారులతో పలు అంశాలపై మాట్లాడారు.

# వినూత్న రీతిలో పోలీసులకు జోహార్లు

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 26 (వార్త):** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రెటరీ, సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో స్టూడెంట్ పోలీస్ క్యాడేట్ ( ఎస్ పి సి) వింగ్‌తో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు పోలీస్ అనే ఆంగ్ల భాష అక్షరాల ఆకారంలో కూర్చున్నారు. విద్యార్థులు కవాతు నిర్వహించి, సెల్యూట్ చేసి పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, మదీనా తదితరులు పాల్గొన్నారు.





## వాహనాల తనిఖీ

**కొత్తూరు,అక్టోబరు 26 (వార్త):** మండల కేంద్రంలో స్థానిక పాలకొండ రోడ్డు వద్ద కొత్తూరు ఎస్సై అహమ్మద్ తన సిబ్బందితో కలసి శనివారం పలు వాహనాలకు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుం విధించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు పట్ల అవగాహన కల్పించడం జరిగిందని కొత్తూరు ఎస్సై ఎం.ఎ అహమ్మద్ తెలిపారు.

## కొత్తూరులో ఓపెన్ హౌస్

పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అహమ్మద్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధివిధానాలు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అపార్ ఐడి పరిశీలన

**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26(వార్త):** నరసన్నపేట మండలం బొరిగివలస గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఎంఈవో యు.శాంతారావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అపార్ ఐడిని త్వరితగతిన పూర్తి చేయాలని పాఠశాల సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.గంగన్న, ఉపాధ్యా యులు, సిఆర్ఎంటి, తదితరులు పాల్గొన్నారు.

## వరి పంట పరిశీలన

**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26(వార్త):** నరసన్నపేట మండలంలోని సత్యవరం గ్రామంలో పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాధస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి వ్యవసాయ సాగు పొట్ట దశకు వచ్చిన సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది చెప్పిన విధంగా సాగు చేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ముకుందరావు, సైంటిస్ట్ ఉదయ్ బాబు, డీఎం బాలకృష్ణ ఏవో సునీత పాల్గొన్నారు.

## వనవిష్ణుపురంలో శాంతి కమిటీ

**పోలాకి, అక్టోబర్ 26 (వార్త):** గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని ఏఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వనవిష్ణుపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరసన్నపేట సీఐతో పాటు ఎస్ఐ, తహశీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## బొడ్డకాళి వేంకటేశ్వర స్వామికి పూజలు



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 26 (వార్త):** బొడ్డకాళి గ్రామంలో కొలువైన కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఒడిశా సంప్రదాయం ప్రకారం కార్తీక మాసోత్సవాలు జరుగుతున్నాయి. నిత్యం భక్తుల గోత్ర నామాలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. కార్తీక మాస రెండో శనివారం స్వామివారు భక్తు లకు ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వంగర కేజీబీవీ సందర్శన

**వంగర, అక్టోబరు 26 (వార్త):** వంగర కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈఓ పి.ప్రవీణ్ కుమార్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు జరుగుతున్న బోధనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రత్యేక అధికారి బి.రోహిణి, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. భోజనంలో మెనూ అమలు చేయాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.

## 1000 లీటర్లు సారా ఊటలు ధ్వంసం

**వంగర, అక్టోబరు 26 (వార్త):** వంగర మండలంలోని 1000 లీటర్లు నాటు సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటలను వంగర ఎస్సై షేక్ శంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ధ్వంసం చేశారు. వీవీఆర్పేట గ్రామపంచాయతీ పరిధిలోని నాటు సారా తయారీకి ఊటలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్ఐ శంకర్ తన సిబ్బందితో వెళ్లి సారా తయారీ ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సిద్ధం చేసిన ఊటలను ధ్వంసం చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉద్యమ నేపథ్యం గల వ్యక్తిని గెలిపించుకుందాం

**జలుమూరు/సారవకోట, అక్టోబర్ 26(వార్త):** సారవకోట, కొత్తూరు మండల కేంద్రాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గిరిధర్ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేపథ్యం గల వ్యక్తిని మనమంతా ఎన్నుకొని గెలిపించుకోవాలని కోరారు. తద్వారా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం సులభతరమవుతాయని అన్నారు. ఇందుకు ఓటు నమోదు చేసుకొని ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.



# కార్యకర్తలే.. టీడీపీకి బలం

*** సభ్యత్వ నమోదులో జిల్లా ముందుండాలి * కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు * జిల్లాలో చురుగ్గా సభ్యత్వ నమోదు**

**శ్రీకాకుళం, అక్టోబరు 26 (వార్త):** తెలుగు దేశం పార్టీకి కార్యకర్తలే బలమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. సభ్యులుగా నమోదైన వారికి రూ.5లక్షల బీమా సౌకర్యం, ఇతర సహాయ సహకారాలు పార్టీ అందజేస్తుందని చెప్పారు. రానున్న ఐదేళ్లలో జిల్లాలో చిరస్థాయిగా నిలిచిపోయే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీంఎంజే బాబు, నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు శీర రమణయ్య, మెండ దాసునాయుడు, కొమ్మనాపల్లి రామరాజు, పాండ్రంకి శంకర్, కవ్వాడి సుశీల, కృష్ణమూర్తి నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఆత్మగౌరవం కోసమే పార్టీ సభ్యత్వం



**పోలాకి, అక్టోబరు 26 (వార్త):** పేదల ఆకలి కేకల నుంచి వ్యక్తి భావ స్వేచ్ఛ కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినట్లు మండల సీనియర్ నాయకులు మాజీ జిల్లా ప్రాదేశిక సభ్యుడు రోణంకి కృష్ణం నాయుడు అన్నారు. శనివారం మండలంలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడారు. పేదోడి గుండెచప్పుడు కోసం పార్టీ ఆవిర్భవించినట్లు అన్నిటికీ మించి వ్యక్తిత్వం కోసమే పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం జరుగుతుం దన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు చురుకుగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయం ప్రతినిధి రావాడ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

## చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

**వజ్రపుకొత్తూరు, అక్టోబర్ 26 (వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి పంచాయతీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శత శాతం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారని మండల పార్టీ అధ్యక్షులు సూరాడ మోహన్ రావు అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు టీడీపీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసుకున్న వారందరికీ పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని చెప్పారు. వంద రూపాయలు రుసుం చెల్లించిన కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయలు బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోరకల వసంత స్వామి, గోవిందపురం పిహెచ్ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, మండల పార్టీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శికె. రమణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోడ రామన్న, అరసవిల్లి ఉమామహేశ్వరరావు, నక్క చంద్రికళా, బెరా సించమ్మ, రాపాక శాంతమూర్తి, దువ్వాడ జయరాం చౌదరి, నెయ్యిల సూర్యనారాయణ, వంక రామారావు, ఆకుల పాపారావు ,చింత యోగేశ్వరరావు, గణపతి, శెగిశెట్టి బీమారావు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పాతపట్నంలో సభ్యత్వ నమోదు

**పాతపట్నం, అక్టోబర్ 26(వార్త):** పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో, పంచాయతీ కార్యాలయం వద్ద కార్యకర్తలు ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని మాట్లాడారు. తెలుగు దేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సభ్యత్వ నమోదులో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. సభ్యులుగా చేరిన వారికి ఐదు లక్షలు రూపాయలు జీవిత బీమా ఉంటుందని తెలిపారు. మొదటి రోజు నియోజకవర్గం మొత్తంగా 1562 సభ్యత్వాలను నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు దోహదం



**మందస, అక్టోబరు 26(వార్త):** తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. మందస పట్టణంలోని తెలుగుదేశం మందస పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ఒక యజ్ఞంలా చేయాలన్నారు. అత్యధికంగా నమోదు చేస్తే.. పార్టీ మరింత బలపడుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబునాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషా ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించబడిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు జీకేనాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, క్లస్టర్ ఇంచార్జి తమరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, రాజాన మహేష్, గార కృష్ణారావు, గువ్వాడ లక్ష్మీ నారాయణ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు నేత్ర పరీక్షలు

**జలుమూరు, అక్టోబర్ 26(వార్త):** గుండువలస ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలను నిర్వహించారు. శనివారం నేత్ర శస్త్ర సహాయ నిపుణులు బాలగంగాధర్ రాజు 120 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేపట్టారు. దృష్టిలోపంతో ఉన్నవారు 12 మంది ఉన్నట్లుగా గుర్తించారు. వీరికి ఉచితంగా కళ్ళజోళ్లు అందిస్తామన్నారు.

అలాగే కరవంజ గ్రామంలోని జడ్పీహెచ్ స్కూల్లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కంటి వైద్యులు డా.విబిజి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 103 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని, వారిలో ఇద్దరు విద్యార్థులకు కళ్లద్దాలకు రిఫర్ చేసామన్నారు. కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే ఏ విటమిన్ కలిగిన ఆకుకూరలు క్యారెట్ మొదలగు ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని కోరారు.

## నిల్వ ఉంచిన బాణాసంచా సీజ్



**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26 (వార్త):** నరసన్నపేట మండలం బాడం గ్రామంలో అనధికారంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు బాడం గ్రామంలో పోలీసులు సోదాలు నిర్వహించి బాణసంచాను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి బాణాసంచాను నరసన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా బాణాసంచాను నిల్వ ఉంచిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు


**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 26(వార్త):** భూ సమస్యల పరిష్కారానికి రైతులకు ఇబ్బందులు లేకుండా నేరుగా వారి వారి గ్రామాలలోని గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. శనివారం నరసన్నపేట మండలం కంబకాయ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభను నిర్వహించారు. గతంలో భూ ఫ్రీ సర్వే చేపట్టడం జరిగిందని దానిలో లోటుపాట్లను సరిదిద్దేందుకే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

**జలుమూరు/సారవకోట, అక్టోబర్ 26(వార్త):** సమగ్ర భూ సర్వేలో భాగంగా జరిగిన లోటుపాట్లపై సవరణ చేపట్టేందుకుగాను గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. సారవకోట మండలం చరణదాసుపురం గ్రామంలో శనివారం గతంలో రీ సర్వే పూర్తి అయిన రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రీ సర్వేలో కొద్దిపాటి తేడాలు ఉన్నట్లుగా గుర్తించి నేడు ప్రభుత్వం వాటిని సవరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

## 90 మందికి నేత్ర పరీక్షలు

**మందస, అక్టోబరు 26(వార్త):** మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొంకడాపుట్టి పంచాయతీ కిల్లోయి గ్రామంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సోషల్ వర్కర్ నాగేశ్వర జయరాం ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన శ్రీపుష్పగిరి కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 90 మందికి డాక్టర్ గేదెల తేజేశ్వరరావు, సవర కాంతారావు, పీఆర్వో హరిబాబు పరీక్షలు నిర్వహించగా వీరిలో 36 మందికి చికిత్స అవసరముగా గుర్తించి, బస్సుల్లో విజయనగరం తరలించారు. బొగాబంద పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి రౌతు దుర్యోధన శిబిరాన్ని ప్రారంభించగా.. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జికుమారచంద్ర, బృందావన్, నౌగాపు నాగేశ్వర్, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.



# టెక్కలిపాడు ఎత్తిపోతల పథకం పునఃప్రారంభం



**జలుమూరు, అక్టోబర్ 26(వార్త):** టెక్కలిపాడు ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పునఃప్రారంభించారు. గత కొద్దిరోజులు క్రితం ఈ పథకానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి 6 లక్షల 50 రూపాయలతో కొత్త ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు వెలమల చంద్ర భూషణ్, భైరి భాస్కరరావు సర్పంచులు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం, గుండ మన్మధరావు, పిరియా వెంకట్రావు, తాన్ని అసిరినాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413